సాక్షి జగిత్యాల

సోమవారం । 5 । మే । 2025



'ఎన్‌రైప్'తో మామిడి 'పండు'

మామిడికాయలను పండుగా మార్చేందుకు చాలా చోట్ల వ్యాపారులు విషపూరితమైన కాల్షియం కార్బైడ్, చైనాపౌడర్‌లను వాడుతున్నారు. 10లో▸



పవర్ లిఫ్టర్లు

చదువుతో పాటు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చాటుతున్నారు స్వప్నిక, ఎస్.ఐశ్వర్య, కుమ్మరి పూజిత, భూక్య శ్రావణి అనే విద్యార్థినులు . 10లో▸

గరిష్టం/కనిష్టం
38.0/27.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి
కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని యథాతథంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ భారతి అవగాహన సదస్సుల నిర్వహణ కారణంగా నిలిపివేసిన ప్రజావాణిని తిరిగి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చునని కలెక్టర్ సూచించారు.

నేడు పెగడపల్లికి మంత్రి సీతక్క రాక

పెగడపల్లి: పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు మంత్రి సీతక్క సోమవారం పెగడపల్లి మండలానికి రానున్నట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఎల్లాపూర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ, మద్దులపల్లిలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 4గంటలకు ఎల్లాపూర్‌లో ప్రజాసభకు హాజరుకానున్నట్లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు.

అద్దకానికి పెద్దమ్మ తల్లి



పెద్దమ్మ తల్లిని అద్దకానికి తీసుకెళ్తున్న ముదిరాజ్ కులస్తులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వేంపేటలోని పెద్దమ్మ తల్లి అమ్మవారిని ఆదివారం అద్దకానికి తీసుకెళ్లారు. ఈనెల 11 నుంచి ప్రారంభమయ్యే జాతర ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మతల్లిని మెట్‌పల్లికి డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, భక్తజనసందోహం మధ్య శోభాయాత్రగా తీసుకెళ్లారు. అద్దకం పూర్తయిన తర్వాత వచ్చే ఆదివారం ఆలయానికి తీసుకొచ్చి గుడిపక్కన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్డులో ఉంచి పూజలు చేస్తారు.15న బోనాలు, 16న అన్నదానం నిర్వహిస్తారు. 18న ఊరేగింపు పూర్తయిన తర్వాత ఆలయంలో ప్రతిష్టిస్తారు. ఐదేళ్లకోసారి ఈ జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

మా ఊరి పిల్లలు ప్రభుత్వ బడిలోకే



సమావేశమైన తల్లిదండ్రులు, మహిళలు

కథలాపూర్: మండలంలోని పోతారం గ్రామంలో ఆదివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళాసంఘాల సభ్యులు, నాయకులు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. తమ ఊరి పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పిద్దామని తీర్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులూ ఉన్నాయని, ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి ఆర్థికభారం కలిగించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ పులి శిరీష, మాజీ సర్పంచ్ ధర్మపురి జలంధర్, హరిప్రసాద్, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ లావణ్య, వీవోఏ తిరుమల, హెచ్‌ఎంలు నరహరి, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



భక్తుల క్యూలైన్

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివార్లను దర్శించుకున్నారు.

వైభవంగా నృసింహుని నవరాత్రోత్సవాలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో రెండోరోజైన ఆదివారం ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం గోదావరినదికి మంగళ వాయిద్యాలతో వెళ్లి బిందే తీర్థం తెచ్చి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ట్రస్టుబోర్డు చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు, వేదపండితులు తదితరులున్నారు.







విద్యుత్ సమస్యలకు క్షణాల్లో పరిష్కారం

- స్తంభాలకు నంబర్ల కేటాయింపు
- డిజిటలైజేషన్ దిశగా చర్యలు
- ఎల్‌సీకి ప్రత్యేక యాప్

జగిత్యాలఅగ్రికల్చర్/సారంగాపూర్/కథలాపూర్: విద్యుత్ లైన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తినా.. అంతరాయం కలిగినా వెంటనే పునరుద్ధరించేందుకు ఎన్‌పీడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సమస్యను త్వరగా గుర్తించేందుకు పోల్ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టారు. ప్రతి స్తంభానికి నంబర్ వేస్తున్నారు. ఎక్కడ సమస్య వచ్చిందో పోల్ నంబరింగ్ ద్వారా సులువుగా తెలుసుకునే అవకాశం ఉందంటున్నారు. పోల్ నంబరింగ్, డిజిటలైజేషన్ ద్వారా సాంకేతిక సమస్యను క్షణాల్లో గుర్తించి విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరించవచ్చంటున్నారు.

ప్రకృతి వైపరీత్యాలు జరిగిన సమయంలో..

ఈదురుగాలులు, వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు విద్యుత్ లైన్‌లో సమస్యలు రావడం సహజం. ఈ సందర్భాల్లో గంటల తరబడి సరఫరా నిలిచిపోయి వినియోగదారులు ఇబ్బంది పడుతుంటారు. డిజిటలైజేషన్ ద్వారా సమస్య ఎక్కడ ఉందో త్వరగా తెలుసుకోవచ్చు. కొత్తగా వచ్చిన ఉద్యోగులు, సిబ్బందికి కూడా అనుకూలంగా ఉంటుంది. వినియోగదారులు సమస్య వచ్చినప్పుడు పోల్ నంబర్ చెబితే సిబ్బంది త్వరగా వచ్చి పరిష్కరించే అవకాశం ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. 33 కేవీ ఫీడర్లలో స్తంభంపై పసుపు రంగుపై ఎరుపు రంగులో నంబర్ వేస్తున్నారు. 11 కేవీ ఫీడర్లలో స్తంభానికి పసుపు రంగు వేసి నల్లని రంగుతో నంబర్ వేస్తున్నారు.

116 ఫీడర్లలో నంబరింగ్ ప్రక్రియ పూర్తి

జిల్లా పరిధిలో 33 కేవీ ఫీడర్లు 42 ఉండగా, అన్నిటికి నంబరింగ్ పూర్తయింది. 11 కేవీ ఫీడర్లు 543 ఉండగా 74 ఫీడర్లలో నంబరింగ్ పూర్తయింది. 158 ఫీడర్లతో నంబరింగ్ వేసే ప్రక్రియ కొనసాగుతుంది. కొన్ని గ్రామాల్లో వరి పంటలు కోతలు పూర్తికాకపోవడంతో జాప్యానికి కారణమని సిబ్బంది అంటున్నారు.



సారంగాపూర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్

ఐదేళ్లలో 475 వరకు విద్యుత్ ప్రమాదాలు

వినియోగదారులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికి ఎక్కడోచోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రజలు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా విద్యుత్ శాఖ ఈనెల ఏడో తేదీ వరకు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తోంది. మోటార్లు ఎక్కువగా వినియోగించే రైతులు, వినియోగదారులను చైతన్యం చేస్తున్నారు. జిల్లాలో ఐదేళ్లలో 475 విద్యుత్ ప్రమాదాలు జరిగాయి. 2020–21లో 115 జరగగా.. 33మంది చనిపోయారు. 14 మంది గాయపడ్డారు. 68 పశువులు మృత్యువాత పడ్డాయి. 2021–22లో 120 విద్యుత్ ప్రమాదాలు జరగగా.. 29మంది చనిపోయారు. 9మంది గాయపడ్డారు. 82 పశువులు మృత్యువాత పడ్డాయి. 2022–23లో 102 ప్రమాదాలు జరగగా.. 32 మంది చనిపోయారు. 11 మంది గాయపడ్డారు. 59 పశువులు మృత్యువాత పడ్డాయి. 2023–24లో 81 ప్రమాదాలు జరగగా.. 22 మంది చనిపోయారు. ముగ్గురు గాయపడ్డారు. 56 పశువులు మృత్యువాత పడ్డాయి. 2024–25లో 57 విద్యుత్ ప్రమాదాలు జరిగి 14 మంది చనిపోగా.. ఇద్దరు గాయపడ్డారు. 41 పశువులు మృత్యువాత పడ్డాయి.

ప్రమాదాలను పరిశీలిస్తే..

జిల్లాలో మూడు లక్షల విద్యుత్ పంపుసెట్లు ఉన్నాయి. మోటార్లు ఆన్ చేసే సమయంలోనే మరణాల శాతం ఎక్కువగా ఉంటోం. కరెంట్ డబ్బాలు ఇనుముతో చేసినవి పెట్టుకోవడం, అందులోకి ఎలకలు వెళ్లి, వైర్లు కొరికినప్పుడు అవి డబ్బాకు తాకి రైతులు దుర్మరణం పాలవుతున్నారు.

ప్రమాదాలకు యాప్‌తో చెక్

వినియోగదారులకు సరైన సేవలు అందిస్తూనే సిబ్బంది కూడా ప్రమాదాల బారిన పడకుండా ఉన్నతాధికారులు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. 33/11కేవీ లైన్లలో సమస్య ఉత్పన్నమైతే సబ్‌స్టేషన్ నుంచి లైన్‌మన్, జూనియర్ లైన్‌మన్ ఎల్‌సీ (లైన్ క్లియర్) తీసుకోవాల్సి ఉంటుంది. ఎల్‌సీ ఇచ్చాకే లోపాలు సరిచేయాల్సి ఉంటుంది. కొన్నిసార్లు లైన్లలో ప్రమాదాలు జరిగి సిబ్బంది గాయపడడం.. మృత్యువాత పడుతుండడం జరుగుతుంది. ఈ క్రమంలో విద్యుత్ శాఖ లైన్‌క్లియర్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

విద్యుత్తు అంతరాయం ఏర్పడినప్పుడు యాప్‌లో సంబంధిత ఫీడర్ పరిధి ఏఈకి సమాచారం ఇవ్వాలి. ఎల్సీ ఇవ్వవచ్చా..? లేదా అని సదరు అధికారి యాప్ ద్వారా తిరిగి సమాచారమిస్తాడు. ఏఈ ఎల్‌సీకి అనుమతి ఇవ్వగానే సంబంధిత లైన్‌మన్‌కు సమాచారం వెళ్లడంతోపాటు, సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఏ ఫీడర్ ఎల్‌సి యాప్ ద్వారా నిర్దిష్టమైన సమాచారం వెలుతుంది.

మంచి నిర్ణయం.. ఆచరణలో పెట్టాలి



డిజిటలైజేషన్ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం మంచి నిర్ణయం తీసుకుంది. విద్యుత్ స్తంభాలకు నంబరింగ్ వేయడం, డిజిటలైజేషన్‌తో సమస్యలు అధికారులకు త్వరగా తెలుస్తాయి. సమస్య తెలుసుకున్న అధికారులు వెంటనే స్పందించాలి. అప్పుడే ఆధునికతకు అర్థం ఉంటుంది.

– దూలూరి శ్రీధర్, సిరికొండ


లొకేషన్ త్వరగా గుర్తించవచ్చు




పోల్ నంబరింగ్, డిజిటలైజేషన్‌తో విద్యుత్ సరఫరాలో సమస్య వస్తే లొకేషన్‌ను త్వరగా గుర్తించవచ్చు. సమస్యను ఉన్నతాధికారులు కార్యాలయంలో ఉండి పర్యవేక్షించవచ్చు. సిబ్బందికి సమాచారం ఇచ్చే వీలుంటుంది. విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకోవచ్చు.

– సాలియా నాయక్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ

నీట్ పరీక్ష ప్రశాంతం





జగిత్యాల: జిల్లాలోని రెండు కేంద్రాల్లో నిర్వహించిన నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నాచుపల్లి జేఎన్టీయూ కేంద్రాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేశారు. అక్కడి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులు ఇబ్బందులు లేకుండా పరీక్ష రాసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఒక సెంటర్‌లో 480, రెండో సెంటర్లో 278 మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. ఒక కేంద్రంలో 13 మంది, మరో కేంద్రంలో ఐదుగురు గైర్హాజరైనట్లు వివరించారు. ఆర్డీవో మధుసూదన్, జేఎన్టీయూ ప్రిన్సిపల్ ప్రభాకర్, కొడిమ్యాల తహసీల్దార్ రమేశ్, సీఐ, ఎస్సైలు ఉన్నారు.

మూడు నిమిషాల ఆలస్యం.. పరీక్షకు దూరం

మల్యాల: జేఎన్టీయూ పరీక్ష కేంద్రం తెలియక మూడు నిమిషాలు ఆలస్యంగా చేరుకున్న ఓ విద్యార్థిని పరీక్ష దూరమైంది. మల్లాపూర్ మండలం వీవీ.రావుపేటకు చెందిన సీహెచ్.నవ్యకు జేఎన్టీయూ కేంద్రం పడింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి బయల్దేరింది. ఇంజినీరింగ్ కళాశాల అడ్రస్‌పై అవగాహన లేక దిగువ కొండగట్టు వరకు వెళ్లారు. పూర్తి అడ్రస్ తెలుసుకుని వెళ్లే సరికి మూడు నిమిషాలు ఆలస్యం కావడంతో అక్కడున్న సిబ్బంది లోపలికి అనుమతించలేదు. గతంలో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకున్నా.. ఆశించిన ఫలితం రాలేదని, మరోసారి పరీక్షకు సన్నద్ధమైన రాయలేకపోయాయని ఆవేదనతో తిరిగి వెళ్లిపోయింది.

తగ్గుతున్న భూగర్భజలం



వ్యవసాయ బావుల్లో అడుగంటిన నీరు



చెరువుల్లో తగ్గిన నీరు

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఏప్రిల్‌లో 5.57 మీటర్ల దిగువకు
- ఒక్క నెలలోనే 0.33 మీటర్లు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో భూగర్భజలాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. వేసవిలో రోజువారి అవసరాలకు నీటి వినియోగం ఎక్కువ కావడంతో.. నీటిమట్టాలు తగ్గిపోతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో కేవలం ఒక్క ఏప్రిల్‌లోనే నీటిమట్టం 0.33 మీటర్లకు పడిపోయింది. ఇక అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే మేలో నీటిమట్టం మరెంత పడిపోతుందోనని ఆందోళన మొదలైంది.

మున్సిపాలిటీల్లో పెరుగుతున్న నీటి వినియోగం

జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ పట్టణాల్లో నీటి వినియోగం పెరిగిపోయి భూగర్భజలం తగ్గుముఖం పట్టడానికి కారణమవుతోంది. ఇంటికో బోరు ఉండడం.. ఇష్టం వచ్చి నట్లు నీటిని వినియోగిస్తుండడంతో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. ఏప్రిల్‌లో మున్సిపాలిటీల్లో పడిపోయిన నీటిమట్టాలను పరిశీలిస్తే.. జిల్లాకేంద్రంలో 8.45 మీటర్లు, కోరుట్ల పట్టణంలో 9.75, మెట్‌పల్లిలో 5.87, రాయికల్‌లో 4.10, ధర్మపురిలో 6.21 మీటర్లకు భూగర్భజలమట్టం పడిపోయింది.

నాన్‌ఆయకట్టు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి

జిల్లాలో నాన్ ఆయకట్టు ప్రాంతాలైన మల్యాల, మేడిపల్లి, కథలాపూర్, కొడిమ్యాల, భీమారం మండలాల్లో భూగర్భజలాలు మరింతగా పడిపోతున్నాయి. మల్యాల మండలంలో 7.71మీటర్లు, కొడిమ్యాలలో 13.14, కథలాపూర్‌లో 3.02, మేడిపల్లిలో 4.84, భీమారంలో 4.75మీటర్లకు నీటిమట్టం పడిపోయింది.

ఒక్కనెలలోనే పడిపోయిన 0.33 మీటర్ల నీటిమట్టం

జిల్లాలో ఒక్కనెలలోనే నీటిమట్టం సగటున 0.33 మీటర్లకు పడిపోయింది. మార్చిలో 5.24 మీటర్ల లోతులో నీరు ఉండగా.. ఏప్రిల్ చివరినాటికి 0.33 మీటర్లు పడిపోయి.. ప్రస్తుతం 5.57 మీటర్లకు చేరుకుంది. గతేడాది ఏప్రిల్‌తో పోల్చితే ఈ ఏడాది 0.13 మీటర్లు తగ్గింది. ఏప్రిల్ చివరినాటికి బీర్పూర్ మండలంలో అతి తక్కువ లోతు 2.34 మీటర్ల లోతులో నీరు ఉండగా.. అత్యధికంగా 13.14 మీటర్ల లోతులో కొడిమ్యాలలో నీరు ఉండటం గమనార్హం. ఆయకట్టు మండలాల్లోనూ నీటి మట్టం పడిపోతూనే ఉంది. బుగ్గారంలో 5.41 మీటర్లు, ఎండపల్లిలో 9.50, గొల్లపల్లిలో 5.13, జగిత్యాల రూరల్‌లో 3.11, పెగడపల్లిలో 5.12, సారంగాపూర్‌లో 6.04, వెల్గటూర్‌లో 3.89, ఇబ్రహీంపట్నంలో 4.81, మల్లాపూర్ మండలంలో 6.57 మీటర్ల మేర భూగర్భజల మట్టం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఆలయ ఉద్యోగులకు వేతనాలు పెంపు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామంటూ ఉద్యోగులు కొందరు స్థానిక ఎమ్మెల్యే, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు విన్నవించారు. ఆయన దేవాదాయశాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. స్పందించిన దేవాదాయశాఖ వేతనాలు పెంచుతున్నట్లు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయంలో పనిచేస్తున్న 19మందికి వేతనాల పెంపు అమలు కానుంది. వీరిలో నలుగురు కాంట్రాక్టు ఉద్యోగులు, 15 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది. కాంట్రాక్టు సిబ్బందికి రూ. 7వేల జీతం ఉండగా రూ.15వేలకు పెంచారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి రూ.12వేలకు పెంచారు. వేతనాల పెంపు ఉత్తర్వులను ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సిబ్బందికి అందించారు. ఆలయ ఈవో శ్రీనివాస్, ట్రస్టు బోర్డు చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు, నాయకులు ఎస్.దినేష్, వేముల రాజు తదితరులున్నారు.



పెరిగిన వేతనాల ఉత్తర్వుల కాపీని అందిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

అసంతృప్తిలో తాత్కాలిక అర్చకులు

ఆలయంలో ఏళ్ల తరబడి పూజలు చేస్తున్నా.. తమకు వేతనాలు పెరగలేదని తాత్కాలిక అర్చకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో తొమ్మిది మంది వరకు ఉన్నామని, వేతనం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సేవాభావం పెంపొందించుకోవాలి

జగిత్యాలటౌన్: ప్రతిఒక్కరూ సేవాభావాన్ని పెంచుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ కరీంనగర్ విభాగ్ సంఘచాలక్ భీమనాతిని శంకర్ అన్నారు. వాల్మీకి ఆవాసం సేవాభారతి ఆధ్వర్యంలో పదిరోజులుగా నిర్వహిస్తున్న సంస్కార సాధన శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం పట్టణంలోని వాల్మీకి ఆవాసంలో నిర్వహించారు. ప్రపంచంలోనే అతి పెద్ద సామాజిక సేవాసంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అని, సేవావిభాగం సేవా భారతి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సుమారు 1.50లక్షల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వాల్మీకి ఆవాసం ద్వారా ఎంతోమంది గ్రామీణ, నిరుపేద విద్యార్థులను విద్యావంతులుగా, ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దామన్నారు. గతేడాది ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి 160 మంది స్వయం ఉపాధి చూపామన్నారు. వేసవిలో పదిరోజుల పాటు శిక్షణ అందించేందుకు ఉచితంగా సంస్కార సాధన శిబిరాన్ని ఏర్పాటు చేశామని, ఆరు కేంద్రాల్లోని 80మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వీరికి యోగా, కరాటే, ఆటలు, దేశభక్తి గీతాలు, శాస్త్రీయ నృత్యం, కోలాటం తదితర అంశాలతో శిక్షణ ఇచ్చామన్నారు. ముందుగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వాల్మీకి ఆవాసం అధ్యక్షుడు జిడిగె పురుషోత్తం, ఉత్తూరి గంగాధర్, కంకనాల నీరజ, మదన్‌మోహన్‌రావు, తుంగూరి సురేష్, సంపూర్ణాచారి, బెత్తెపు లక్ష్మణ్, సత్యం, గండ సురేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

జగిత్యాలటౌన్: అంబేడ్కర్ అందించిన సేవలు చిరస్మరణీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రచార కార్యదర్శి ఓరుగంటి భార్గవరాం అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహించే కార్యక్రమానికి భార్గవరాం ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, సంఘ సంస్కర్త అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ) జిల్లా అధ్యక్షుడు నల్ల శ్యాం, రిటైర్డ్ ఎంఈవో మద్దెల నారాయణ, అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీకూరి శ్రీహరి, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్, పొనగంటి రాజయ్య, నక్క రాజేందర్, గజ్జెల రాజు, కాయితి శ్రీనివాస్, ఉద్యోగ సంఘాల నాయకులు దాసరి లక్ష్మణ్, నాయకులు బొల్లం రమేష్, జవ్వాజి శంకర్, కాశీనాథం పాల్గొన్నారు.

క్లుప్తంగా

విషపురుగు కాటుకు వ్యక్తి మృతి

సారంగాపూర్(జగిత్యాల): రోళ్లవాగు ప్రాజెక్టు వద్ద ఎండ్రికాయలు పడుతుండగా పాము కాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. బీర్‌పూర్ ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నందగావ్ గ్రామానికి చెందిన గణపతిదేవ్‌రావు టార్వే (34) తన స్నేహితుడు సూర్యభాను మారుతితో కలిసి శనివారం ఎండ్రికాయలు పట్టేందుకు బీర్‌పూర్ శివారులోని రోళ్లవాగు ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో ఎండ్రికాయలు పడుతున్న క్రమంలో చీకటిగా ఉండడంతో విషపురుగు కాటువేసింది. వెంటనే సూర్యభాను మారుతి 100కు డయల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకుని గణపతిదేవ్‌రావు టార్వేను 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యహ్నం మృతిచెందాడు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా నిర్మల్ జిల్లా సరిహద్దుల్లోని మహారాష్ట్ర ప్రాంతానికి చెందినవారు జీవనోపాధి కోసం ఇక్కడి వచ్చి ఎండ్రికాయలు పట్టుకుని వెళ్తుంటారని పోలీసులు తెలిపారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

హుజూరాబాద్: కోతుల దాడిలో ఆదివారం మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికుల వివరాలు.. పట్టణంలోని విద్యానగర్ మూడో రోడ్‌లో కోతుల మంద భారీ సంఖ్యలో తిరుగుతూ పుల్లూరి త్రివేణిని తీవ్రంగా గాయపరిచాయి. కోతులతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను మున్సిపల్ అధికారులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

శివలింగం, నంది విగ్రహం లభ్యం



శివలింగం, నందివిగ్రహం

చొప్పదండి: మండలంలోని దేశాయిపేట గ్రామ చెరువు వద్ద ఆదివారం నంది, శివలింగం విగ్రహాలు లభ్యమయ్యాయి. విషయం తెలిసిన గ్రామస్తులు విగ్రహాల వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేస్తున్నారు. విగ్రహాలు లభ్యమైన చోటనే శివాలయం నిర్మించాలని కొందరు అభిప్రాయం వ్యక్తం చేయగా పూజారులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని మరి కొందరు అన్నారు. ఆలయ నిర్మాణానికి వేరే స్థలం తీసుకొని విగ్రహాలు ప్రతిష్ఠించాలని గ్రామంలోని నాయకులు పేర్కొన్నారు.

డబ్బులతో ఉడాయించిన వ్యాపారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గొల్లపల్లిలో బట్టల వ్యాపారులుగా స్థిరపడ్డ రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు అందినకాడికి అప్పు చేసి రూ.50లక్షలతో రాత్రికిరాత్రే ఉడాయించారు. విషయం తెలుసుకున్న రుణదాతలు లబోదిబోమంటున్నారు. బాధితులు ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. వివరాలు.. రాజస్థాన్‌లోని నాగుల్‌కు చెందిన గుమాన్ రాచర్ల గొల్లపల్లిలో బట్టల వ్యాపారిగా స్థిరపడ్డాడు. మరొకరితో కలిసి వ్యాపారం కోసమని స్థానికుల నుంచి రూ.లక్షల్లో అప్పు చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా పలు చిట్టీలను ఎత్తుకున్నారు. ఇద్దరు కలిసి సుమారు రూ.50లక్షలకు పైగా అప్పులు చేసి గుట్టుచప్పుడు ఉడాయించారు. మూడు రోజుల క్రితమే వారు గ్రామాన్ని విడిచి పరారీ కాగా.. విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. దీంతో అప్పులు ఇచ్చిన వారు తల పట్టుకుంటున్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో పరారీ అయిన వ్యాపారుల కోసం గాలిస్తున్నారు. అప్పులిచ్చిన వారి వివరాలు సేకరిస్తున్నారు.

‘ఎన్‌రైప్’తో మామిడి ‘పండు’

- కాయలను పండుగా మార్చే పౌడర్
- మామిడి మార్కెట్లో చైనా పౌడర్లు వాడుతున్నట్లు ప్రచారం
- కాల్షియం కార్బైడ్‌ను నిషేధించిన ప్రభుత్వం
- ఎన్‌రైప్ పౌడర్ విక్రయాలకు సర్కార్ అనుమతి



మామిడి అట్టపెట్టెలో పండుగా మార్చే నిషేధిత కాల్షియం కార్బైడ్ ప్యాకెట్లు



ఆగ్రోస్ కేంద్రాల్లో విక్రయించే ‘ఎన్‌రైప్’ ప్యాకెట్లు

జగిత్యాలఅగ్రికల్చర్: మామిడికాయలను పండుగా మార్చేందుకు చాలా చోట్ల వ్యాపారులు విషపూరితమైన కాల్షియం కార్బైడ్, చైనాపౌడర్‌లను వాడుతున్నారు. ఇటీవల జగిత్యాల (చల్‌గల్) మామిడి మార్కెట్ నుంచి ఇతర రాష్ట్రాలకు తరలించే కాయల్లో కాల్షియం కార్బైడ్ కలిగిన చైనాపౌడర్లు వాడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాంటి పండ్లను తింటున్న వినియోగదారులు క్యాన్సర్ బారిన పడుతుండడంతో ఆరోగ్య సంస్థ, హైకోర్టు కాయను పండుగా మార్చే రసాయనాలను నిషేధించింది. దీంతో కాయను పండుగా మార్చేందుకు ఎన్‌రైప్ అనే సేంద్రియ పౌడర్‌ను ఉపయోగిస్తున్నారు. ఎన్‌రైప్‌ను ఉపయోగించాలని ఉద్యాన శాఖ ప్రచారం చేస్తుండగా, ఆగ్రోస్ సంస్థ ఆ పౌడర్‌ను మార్కెటింగ్ చేస్తుంది.

పండ్లలో రారాజు..

పండ్లలో రారాజు మామిడిలో అన్ని రకాల పోషకాలు ఉండడంతో ప్రతి ఒక్కరూ తినేందుకు ఇష్టపడుతుంటారు. గతంలో పక్వానికి వచ్చిన కాయలను గడ్డి, మామిడి ఆకు కింద మాగబెట్టేవారు. అప్పుడు మామిడిపండ్లు రుచిగా, నాణ్యతగా ఉండేవి. కాగా, మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి వ్యాపారులు రసాయనాలతో పండుగా మార్చడం మొదలుపెట్టారు. దీంతో మామిడి పండుతో లాభం కంటే నష్టం ఎక్కువగా జరగడంతో ప్రభుత్వం రసాయనాలను నిషేధించింది.

అట్టపెట్టెల్లో చైనా ప్యాకెట్లు

చల్‌గల్ మామిడి మార్కెట్ నుంచి పంజాబ్, హరియాణా, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు ఎక్కువగా మామిడికాయలు ఎగుమతి చేస్తారు. జగిత్యాల నుంచి ఢిల్లీ వెళ్లాలంటే లారీకి రెండురోజులు పడుతోంది. సదరు కాయలను అక్కడి వ్యాపారులు పండుగా మార్చాలంటే మరో నాలుగైదు రోజులు పడుతోంది. దీంతో వ్యాపారులు త్వరగా మార్కెటింగ్ చేసుకోవాలనే ఉద్దేశంతో ఆయా రాష్ట్రాలకు పంపే మామిడికాయల అట్టపెట్టెల్లో చైనాపౌడి ప్యాకెట్లను విచ్చలవిడిగా వాడుతున్నారు. కాయను పండుగా మార్చే పౌడర్లను ప్రభుత్వం నిషేధించింది. దీనికి తోడు, చాలా మంది పక్వానికి రాని కాయలను విక్రయిస్తుండడంతో వాటిని కొనుగోలు చేసిన వ్యాపారులు, ఢిల్లీ వెళ్లేవరకు కాయ నాణ్యత చెడిపోతుండడంతో వాటికి సైతం పౌడర్లు వాడుతున్నారు.

ఎన్‌రైప్‌కు ప్రభుత్వ అనుమతి

సహజ సిద్ధమైన స్టార్చ్(గంజి)లో ఉండే ఇథలిన్, మాడ్చిన కొబ్బరిచిప్పల పౌడితో ‘ఎన్‌రైప్’ పౌడర్‌ను తయారు చేస్తారు. ఈ పౌడర్‌తో కాయ పండుగా మారినా రుచి, నాణ్యతలో తేడా ఉండదు. ఈ మేరకు బెంగళూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రిసెర్చ్ సంస్థ ఆమోద ముద్ర వేయగా, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతి ఇవ్వగా, తెలంగాణలో ఎన్‌రైప్‌ను అమ్మేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

పండుగా ఎలా మార్చుతుందంటే..

ఎన్‌రైప్ ప్యాకెట్ రూ.పదికి మార్కెట్లో దొరుకుతోంది. ఒక ప్యాకెట్ ద్వారా 10–15 కిలోల మామిడి కాయలను పండుగా మార్చవచ్చు. పక్వానికి వచ్చిన కాయలను అట్టపెట్టెలో పెట్టి అందులో నాలుగైదు చోట్ల చిన్నరంధ్రాలు చేసిన ఎన్‌రైప్ ప్యాకెట్‌ను వేసి గాలి తగలకుండా సీల్ చేయాలి. ఎన్‌రైప్ ద్వారా నాలుగైదు రోజుల పాటు అవసరమైన ఇథలిన్ గ్యాస్ విడుదలై కాయ పండుగా మార్చుతుంది.

తనిఖీలు నిర్వహించాలి



మామిడి మార్కెట్‌తో పాటు రోడ్డు వెంట ఉన్న షెడ్లు, మామిడి విక్రయాలు చేసే దుకాణాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించాలి. కాల్షియం కార్బైడ్, చైనాపౌడర్లు వాడటంపై స్పష్టమైన నిబంధనలు పాటించాలి. ఆరోగ్యం కోసం తినే మామిడిపండు మనిషి అనారోగ్యానికి గురయ్యేలా తయారయితే ఏం లాభం.

– సత్యనారాయణరెడ్డి, ధర్మపురి

ప్రభుత్వ అనుమతితోనే ఎన్‌రైప్..



ప్రభుత్వ అనుమతితోనే ఎన్‌రైప్ విక్రయాలు జరుగుతున్నాయి. అగ్రోస్ సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. మామిడికాయను ఎన్‌రైప్‌తో పండుగా మార్చవచ్చు. ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావు. కాల్షియం కార్బైడ్, చైనాపౌడిని ప్రభుత్వం నిషేధించింది.

– శ్యాంప్రసాద్, జిల్లా ఉద్యానశాఖాధికారి, జగిత్యాల

పవర్ లిఫ్టర్లు

- పతకాల సాధనలో క్రీడాకారిణులు
- ఉత్తరాఖండ్‌లో అంతర్జాతీల పోటీలు
- నేటి నుంచి ఈనెల 12 వరకు నిర్వహణ
- రాష్ట్ర వ్యాప్తంగా 15 మందిలో నలుగురు ధర్మపురి వాసులే



పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ఐశ్వర్య (ఫైల్)

ధర్మపురి: చదువుతో పాటు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ చాటుతున్నారు. పేద కుటుంబాలకు చెందిన స్వప్నిక, ఎస్.ఐశ్వర్య, కుమ్మరి పూజిత, భూక్య శ్రావణి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. సోమవారం నుంచి ఈనెల 12 వరకు ఉత్తరాఖండ్‌లో జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటారు. ఈ పోటీలకు తెలంగాణ నుంచి మొత్తం 15 మంది ఎంపిక కాగా, వారిలో జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన నలుగురు ఎంపికయ్యారు. వీరంతా మండలంలోని మగ్గిడి మోడల్ కళాశాలలో చదివారు. ప్రస్తుతం ఇద్దరు కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్నారు. ఐశ్వర్య, భూక్య శ్రావణికి ఫేస్‌బుక్ మిత్రులు (ఎన్నారైలు) రూ.1.16 లక్షలు, కుమ్మరి పూజితకు వీరా జిమ్ నిర్వాహకుడు నరేశ్ రూ.12 వేలు ఆర్థికసాయం అందించారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



అమ్మానాన్న కవిత, రాజయ్య వ్యవసాయ కూలీలు. మోడల్ స్కూల్‌లో ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ చదువుతున్న. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉన్నత స్థాయికి చేరుకుంటా.

– పూజిత, కమలాపూర్, ధర్మపురి

పతకం సాధిస్తా



మాది మండలంలోని నక్కలపేట. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని రైల్వే ఉద్యోగం చేయ డం లక్ష్యం. మగ్గిడి మోడల్ స్కూల్ పీఈటీ రాజేందర్ శిక్షణలో ఈ స్థాయికి ఎదిగిన. తప్పకుండా పతకంతో వస్తా.

– భూక్య శ్రావణి, నక్కలపేట, ధర్మపురి

మనిషికి చిటికెడంతా ప్రేమ అవసరం

- కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్



పురస్కారాలు ప్రదానం చేస్తున్న నలిమెల భాస్కర్, కవులు

కరీంనగర్‌కల్చరల్: కూడు, గూడు, బట్టలాగే ప్రేమ కూడా మనిషికి కనీస అవసరమేనని, కవిత్వ పఠనంతో మనిషికి చిటికెడంతా ప్రేమైనా అందాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్ అన్నారు. ఆదివారం తెలంగాణ రచయితల వేదిక, ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్టు నిర్వహణలో సాహిత్య పురస్కారాల సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ట్రస్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాధేయ మాట్లాడుతూ, కవిత్వాన్ని ప్రేమించే తాను సృజనకారులను ప్రోత్సహించడానికి 37 ఏళ్లుగా పురస్కారాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన వైష్ణవశ్రీకి సత్యదేవి సాహిత్య పురస్కారం, వరంగల్ కవి నందకిషోర్‌కు ఉమ్మడిశెట్టి సతీశ్‌కుమార్ యువ పురస్కారం, తిరుపతికి చెందిన సుధామురళికి రాజయ్య కవితా పురస్కారాన్ని నలిమెల చేతులమీదుగా ప్రదానం చేశారు. అలాగే కరీంనగర్‌కు చెందిన యుగంధర్ కవితా సంపుటి ‘ఇదేమి యుద్ధం’ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవులు అన్నవరం దేవేందర్, సీవీ కుమార్, కందుకూరు అంజయ్య, గాజోజు నాగభూషణం, నడిమెట్ల రామయ్య, విలాసాగరం రవీందర్, తోట నిర్మలరాణి, పెనుగొండ సరసిజ, రామానుజం సుజాత, నీలగిరి అనిత, నసీరుద్దీన్, నెరువట్ల చైతన్య, కూకట్ల తిరుపతి, మోర అనిల్, పీఎస్ రవీంద్ర, బీవీఎం స్వామి, గుండు రమణయ్య, గాజుల రవీందర్, ప్రేమసాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెలరేగిన మంటలు.. తప్పిన ప్రమాదం



రైస్‌మిల్‌కు సమీపంలో మంటలు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని ఊట్‌పెల్లి గ్రామశివారులో శనివారం రాత్రి పిచ్చిమొక్కలకు నిప్పంటుకొని మంటలు చెలరేగడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. పిచ్చిమొక్కలకు అంటుకున్న మంటలు వ్యాపించి గ్రామశివారులోని రైస్‌మిల్, పెట్రోల్ బంక్ సమీపం వరకు చేరుకున్నాయి. గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని మంటలార్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. ఎస్సై నవీన్‌కుమార్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని ప్రజలను అప్రమత్తం చేశారు. మెట్‌పల్లి నుంచి ఫైరింజన్ వచ్చి మంటలార్పేసింది. అగ్నిప్రమాదంలో రైస్‌మిల్, పెట్రోల్ బంక్‌కు ఎలాంటి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



ఈశ్వర.. పరమేశ్వర..

వేములవాడ: రాజన్నను ఆదివారం 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. మండుతున్న ఎండలను లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.





వేసవి దుక్కి.. పంటకు పుష్టి

- పంట కొయ్యలు కాల్చేస్తే ప్రమాదమే
- తొలకరికి ముందు లోతు దుక్కులు మేలు
- ఏటవాలుగా దున్నితే మరింత శ్రేయస్కరం



దుక్కి చేస్తున్న రైతు

కరీంనగర్ అర్బన్: శాస్త్రవేత్తల మాటలు కాకుండా సొంత నిర్ణయాలే పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. పంట కొయ్యలు కాలకుండా కలియదున్నడం, వేసవిలో లోతు దుక్కులతో ఎంతో ప్రయోజనం. పురుగులు, తెగుళ్ల, కలుపును నివారించుకోవడంతో పాటు భూమిపొరల్లో వర్షపునీరు ఇంకి పంటకు ఉపయోగపడుతుంది. వేసవిలో లోతు దుక్కుల ఉపయోగాల గూర్చి కరీంనగర్ వ్యవసాయ పరిశోధనస్థానం హెడ్ డీన్ డా.జి.మంజులత వివరించారు. వేసవి దుక్కులకు ఏప్రిల్, మే నెలలు అనుకూలం, వేసవి దుక్కులను అడ్డం, పొడువు సాళ్లతో కాకుండా ఏటవాలుగా దున్నడం శ్రేయస్కరం.

ఏటవాలు దుక్కితో ప్రయోజనాలనేకం

ఏటవాలుగా దున్నడం వల్ల భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. లోతుగా దున్నినపుడు భూమిలోపలి పొరల్లో ఉన్న క్రిమికీటకాలు సూర్యకిరణాలతో చనిపోతాయి. వేసవి దుక్కుల్లో తొలకరి వర్షాలు కురిసినపడు విత్తనాలు వేసుకునేందుకు అనుకూలంగా ఉంటుంది. తొలకరి వర్షాలకు ముందే రెండుసార్లు దున్నితే గట్టిగా ఉన్న భూమి గుల్లబారడంతో పాటు కలుపు నివారించుకోవచ్చు. వర్షం నీరు భూమిలోకి చొచ్చుకొనిపోతోంది, భూమి పొరల్లోకి గాలి చేరుతుంది. సూక్ష్మజీవుల సాంద్రత, సేంద్రియ కర్బనం బాగా పెరుగుతుంది. దీంతో భూమిలోని పోషకాలను మొక్క గ్రహించడానికి అనుకూలంగా ఉంటుంది. కలుపు, పురుగు మందుల అవశేషాలకు మొక్కలు తీసుకోవు. భూమి వర్షపునీటిని తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది. గాలిలో ఉన్న నత్రజని వర్షపునీటితో కలిసి భూమిలోకి చేరడం వల్ల భూసారం పెరుగుతుంది. పురుగుమందులు, తెగుళ్ల మందులకయ్యే పెట్టుబడిని తగ్గించుకోవచ్చు. హానిచేసే బాక్టీరియాను నాశనం చేయొచ్చు.

వరికొయ్యలు కలియదున్నాలి

వరి కోతలు పూర్తయ్యాక కొయ్యలను తగులబెడుతుంటారు. దీనివల్ల భూమి సారం కోల్పోతుంది. అలా కాకుండా వరి కొయ్యలను నీటిలో నాన్చి దున్నడం లేదా బీడులోనే కలియదున్నితే నేలలో పోషక విలువలు పెరుగుతాయి. పత్తి రైతులు కాల్చివేయకుండా కలియదున్నాలని శాస్త్రవేత్తలు స్పష్టం సూచిస్తున్నారు. ప్రమాదాల నివారణతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవాలి.

7 నుంచి క్రికెట్ శిక్షణ శిబిరాలు

- కరీంనగర్, గోదావరిఖని, వేములవాడ, జగిత్యాలలో నిర్వహణకు కేడీసీఏ రెడీ
- ఈ నెల 6 లోపు దరఖాస్తు చేసుకున్న వారికే అవకాశం



గతేడాది శిక్షణ శిబిరంలో క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: క్రికెట్‌లో ఓనమాలు నేర్పించేందుకు హెచ్‌సీఏ, కేడీసీఏ శ్రీకారం చుట్టాయి. గతంలో మూడు జిల్లాల్లోనే శిబిరాలు నిర్వహించగా, ఈ ఏడాది నుంచి జగిత్యాలలో శిబిరాన్ని ప్రారంభించనున్నారు. నిష్ణాతులైన కోచ్‌ల సమక్షంలో శిక్షణ ఇవ్వనున్నట్లు క్రికెట్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.ఆగంరావు, ఎన్.మురళీధర్‌రావు తెలిపారు. ఈనెల 7 నుంచి జూన్ 6 వరకు శిబిరాలు నిర్వహిస్తారు. ఈ నెల 6లోపు దరఖాస్తు చేసుకోవాలని క్రికెట్ సంఘం బాధ్యులు తెలిపారు.

13 నుంచి 23 ఏళ్ల వారికి..

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అనుబంధమైన కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శిబిరాలు నిర్వహిస్తారు. 13 నుంచి 23 ఏళ్ల బాలబాలికలు, పురుషులకు, మహిళలకు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు.

దరఖాస్తు ఇలా..

క్రీడాకారులు ఫొటో, ఆధార్‌కార్డుతో సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. కరీంనగర్ వావిలాలపల్లిలోని జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు వైట్ యూనిఫాంతో రావాలి. మిగిలిన కిట్ శిబిరంలో ఇస్తారు. ఒక్కో శిబిరంలో 100 నుంచి 120 మంది క్రీడాకారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ముందుగా దరఖాస్తు చేసుకునే వారికి అవకాశం దక్కుతుంది.


రాణించినవారు హెచ్‌సీఏ టోర్నమెంట్‌లో..

శిక్షణ శిబిరాల్లో రాణించిన క్రీడాకారులకు మంచి అవకాశాలు దక్కనున్నాయి. శిబిరం అనంతరం జూన్‌లో ఉమ్మడి జిల్లా క్రికెట్ టీంలను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. అండర్–14,16,19,23 విభాగాల్లో జట్లను ఎంపిక చేసి హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ సంఘం) ఆధ్వర్యంలో జరుగనున్న టోర్నమెంట్‌లకు పై జట్లను పంపించనున్నారు.

శిబిరాలు నిర్వహించే ప్రదేశాలు

- కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎదురుగా ఉన్న క్రికెట్ అసోసియేషన్ మైదానం, సెయింట్ అల్ఫోన్స్ పాఠశాల మైదానంలో శిబిరాలు జరుగుతాయి.
  సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 86887 68775 (శ్రావణ్‌కుమార్)
- పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం కాలనీలోని జీఎం గ్రౌండ్‌లో శిక్షణ శిబిరం జరగనుంది.
  సంప్రదించాల్సిన ఫోన్‌నంబర్ 98663 51620 (కిరణ్‌కుమార్)
- రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని 2వ బైపాస్‌లో గల స్వర్గీయ నర్సింగరావు మైదానంలో శిబిరం జరుగనుంది.
  సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 91772 59935 (రాజు)
- జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మినీస్టేడియం లేదా ఎస్కేఎన్ఆర్ కళాశాల మైదానంలో తొలిసారిగా శిక్షణ శిబిరం జరుగనుంది.
  సంప్రదించాల్సిన ఫోన్‌నంబర్ 99480 64712 (జలపతి)

క్రికెటర్లుగా ఎదిగేందుకు అవకాశం



క్రికెట్ అంటే చిన్నారులకు ఎంతో ఇష్టం. చాలా మంది పిల్లలు మైదానాలు, గల్లీలో క్రికెట్ ఆడుతంటారు. వీరందరు క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే శిబిరాల్లో పాల్గొనాలి. అత్యాధునిక పద్ధతుల్లో కోచ్లు ట్రైనింగ్ ఇస్తారు. క్రికెటర్లుగా ఎదగాలనుకునే చిన్నారులు శిబిరాల్లో శిక్షణ తీసుకుంటే చాలా బాగుంటుంది.

– వి.ఆగంరావు, క్రికెట్ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఏటీఎంలో నగదు కాజేసేందుకు కుట్ర



ఏటీఎంను పరిశీలిస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: ఏటీఎంలో నగదు కాజేసేందుకు గుర్తు తెలియని వ్యక్తులు కుట్రపన్నారు. కరీంనగర్ టూటౌన్ పోలీసులు, ఏటీఎం నిర్వాహకుల వివరాలు.. నగరంలోని క్రిస్టియన్‌కాలనీలోని ఎస్‌బీఐ ఏటీఎంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం ప్రవేశించి, ఏటీఎం మిషన్ తలుపుతెరిచి, డబ్బు కాజేసేందుకు పరికరాన్ని అమర్చారు. ఉన్నతాధికారులు సీసీ ఫుటేజీ ద్వారా గమనించి, ఏటీఎం చానల్ ఎగ్జిక్యూటర్ రజినీకాంత్‌కు సమాచారమిచ్చారు. ఆయన పోలీసుల కు ఫిర్యాదు చేయగా, సీఐ సృజన్‌రెడ్డి ఏటీఎంను పరిశీలించారు. నగదు డ్రా చేసినవారి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

అత్తపై కోడలు దాడి



వృద్ధురాలిని స్టేషన్‌కు తీసుకెళ్తున్న సఖి కేంద్రం నిర్వాహకులు

జగిత్యాలక్రైం: అత్తపై కోడలు కత్తితో దాడిచేయగా, కేకలు వేయడంతో స్థానికులు కాపాడి సఖి కేంద్ర నిర్వాహకులకు అప్పగించారు. స్థానికుల వివరాలు.. జిల్లా కేంద్రంలోని జంబిగద్దె ప్రాంతానికి చెందిన పెండ్యాల భాగ్య సంతానం లేకపోవడంతో వినయ్ అనే వ్యక్తిని పెంచుకుంది. అతడికి అఖిల అనే యువతితో వివాహం జరిపించింది. కాగా, కొన్నేళ్లుగా అత్తను అఖిల శారీరకంగా, మానసికంగా వేధిస్తుంది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉన్న బోరు వేయాలని అఖిల అత్తకు సూచించగా, ఆమె మరిచిపోయింది. దీంతో ఆగ్రహించిన కోడలు ఇంట్లోని కత్తితో అత్తపై దాడిచేయగా వీపు, ముఖంపై స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు జిల్లా సంక్షేమశాఖాధికారి నరేశ్‌కు సమాచారం అందించగా, వెంటనే సఖి నిర్వాహకులు లావణ్య, సామాజిక కార్యకర్త శారద చేరదీసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎస్సై గీత వృద్ధురాలి కోడలు, కొడుకును పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సఖి కేంద్ర నిర్వాహకులు వృద్ధురాలిని ఆమె ఇంటికి తరలించారు.